



'స్థానికం'పై కాంగ్రెస్ గురి

- ఆదిలాబాద్‌లో పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశం
- మెజార్టీ స్థానాల గెలుపే లక్ష్యంగా ముందుకు
- పార్టీ కార్యకర్తలకు హైకమాండ్ దిశానిర్దేశం
- గ్రూపు విభేదాలపై మండిపడ్డ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు
- స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని పిలుపు
- వర్గ విభేదాలతో ఫ్లెక్సీలను చించి వేసుకున్న కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షి, చిత్రంలో పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి సీతక్కతదితరులు

ఆదిలాబాద్, జనవరి6 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టిని సారించింది. ఇందులో భాగంగానే సోమవారం జిల్లా కేంద్రంలో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పార్లమెంట్ విస్తృత స్థాయి ముఖ్య కార్యకర్తల సమీక్ష సమావేశాన్ని ఆదిలాబాద్ నియోజక వర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. మునుపెన్నడూ లేనివిధంగా రాష్ట్ర స్థాయి నేతలు ఈ సమావేశానికి హాజరుకావడం చర్చనీయాంశంగా మారింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షి, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్‌పెరమల్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, పలువురు ముఖ్య నేతలకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళులర్పించా రు. ఉమ్మడి జిల్లాలోని పార్లమెంట్ స్థాయిలోని నియోజక వర్గాలైన ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్, నిర్మల్, ముథోల్, ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజక వర్గాల నుంచి కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. క్షేత్ర స్థాయిలో కార్యకర్తలు బలంగా ఉంటేనే పార్టీ పటిష్ఠంగా ఉంటుందని పేర్కొన్నారు. గడిచిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని పలు వురు అభిప్రాయపడ్డారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ చైర్మన్ పదవులను దక్కించుకునేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. నియోజకవర్గ ఇన్‌చార్జీలు బాధ్యతాయుతంగా పనిచేస్తేనే పార్టీ పరిస్థితి మెరుగు పడుతుందని హెచ్చరించారు. ఇన్‌చార్జీలే ఫైనల్‌కాదని, అన్ని విషయాల్లో తలదూర్చవద్దంటూ సూచించారు. ప్రస్తుతం జిల్లాలో పార్టీకి ఒకే ఒక ఎమ్మెల్యే ఉన్నాడని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించాలన్నారు. అయితే అన్ని నియోజకవర్గాల్లో నేతల మధ్య గ్రూపు విభేదాలు కొంత ఇబ్బందికరంగా మారాయంటూ పలువురు నేతలు అభిప్రాయపడ్డారు. కొందరు నేతల ఫిర్యాదులతో చిరాకు వస్తుందని స్వయాన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అనడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ పెద్దలు, మంత్రులు, ఎమ్మెల్యేలను జోకడం మానుకోని పార్టీ కోసం పని చేయాలని హెచ్చరించారు.



పార్లమెంటరీ విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు

పార్టీ కార్యకర్తల్లో జోష్

పార్లమెంట్ విస్తృత స్థాయి సమీక్ష సమావేశంతో కార్యకర్తల్లో జోష్ కనిపించింది. ముఖ్యంగా రూ.2లక్షలకు పైగా రుణమాఫీపై నేతలు మాట్లాడిన సమయంలో కార్యకర్తలు కేరింతలు, చప్పట్లు కొడుతు మద్దతును తెలిపారు. అయితే జిల్లాకు అగ్రనేతలు రావడంతో రోడ్డుకిరువైపులా నేతలు పోటాపోటీగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ప్రొటోకాల్ పాటించలేదంటూ ఇరువర్గాలు ఫ్లెక్సీలను చించివేయడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, పురాణం సతీష్, వేణుగోపాల్, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, కంది శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ అడ్డిబోజారెడ్డి, శ్రీహరిరావు, మాజీ ఎంపీ సోయంబాపురావ్, ఆత్రంసుగుణ, ఆత్రంసక్కు, ఆడేగజేందర్, వేణుగోపాలచారి, శ్యాంనాయక్, విశ్వప్రసాద్, శ్రీకాంత్‌రెడ్డి, రేఖానాయక్, రాథోడ్‌బాపురావ్, గోకగణేష్‌రెడ్డి, తదితరులున్నారు.

మండిపడ్డ ఎమ్మెల్యే బొజ్జు..

పార్టీలో జరుగుతున్న గ్రూపు విభేదాలపై ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు తీవ్రంగా మండిపడ్డారు. కొందరు నేతలు పార్టీలోనే ఉంటూ ఇతర పార్టీలకు కోవర్టులుగా పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియాకు లీకులు ఇస్తూ ఎమ్మెల్యేను బద్నాం చేసేందుకు పనిగట్టుకొని కొందరు పని చేస్తున్నారని హెచ్చరించారు. అందరు భాగా పని చేస్తే పార్లమెంట్ ఎన్నికల్లో ఎలా ఓడిపోయామో అధిష్టానం పెద్దలు ఒక్కసారి పరిశీలించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.2లక్షల రుణమాఫీ జరిగిందని, పార్టీలో ఉంటూ పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడడం సరికాదన్నారు.

సంక్రాంతి తర్వాత నామినేటెడ్ పదవులు..

: టీపీసీసీ అధ్యక్షుడు, మహేశ్‌కుమార్‌గౌడ్



పార్టీనే నమ్ముకుని పని చేసిన కార్యకర్తలు, నేతలకు కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యతను ఇస్తుంది. సంక్రాంతి తర్వాత అన్ని నామినెట్ పదవులను భర్తి చేస్తామం. ప్రతి నియోజక వర్గానికి రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవులను కేటాయిస్తాం. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 90శాతానికి పైగా స్థానాల్లో గెలవాలి. ఎమ్మెల్సీ కవిత ఏం ముఖం పెట్టుకుని జిల్లాలో పర్యటిస్తుందో చెప్పాలి. ఉద్యమనాయకుడిగా కేసీఆర్‌ను గౌరవిస్తాం. కాని రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి వదిలేయడం బాధాకరం.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి..

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షి



ప్రతీ కార్యకర్త గెలుపే లక్ష్యంగా పని చేయాలి. జనవరి 26 వరకు సంవిధాన్ ర్యాలీలను నిర్వహిస్తాం. జిల్లాలో కాంగ్రెస్ బలంగా కనిపించడం లేదు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలంతా కలిసి కట్టుగా పని చేయాలి. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా పూజించే అంబేద్కర్ పట్ల కేంద్ర హోం మంత్రి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదు. కాంగ్రెస్‌కు శక్తివంతమైన కార్యకర్తలు ఉన్నారని అంతా ఐకమత్యంగా పని చేస్తే కేంద్రంలోను అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

లక్ష సార్లు అంబేద్కర్ పేరే చెబుతాం..

: ఏఐసీసీ సెక్రటరీ, విశ్వనాథన్ పెరమల్

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అంబేద్కర్‌ను అవమాన పరిచింది. పార్లమెంట్‌లో అమిత్‌షా అంబేద్కర్ గురించి అవమాన పరిచే విధంగా మాట్లాడడం బాధాకరం. జనవరి 26 వరకు సంవిధాన్ ర్యాలీలను నిర్వహించాలి. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ గొప్ప ఆర్థిక వేత్త అని ఆయనను దేశం కోల్పోయింది. ప్రతికార్యకర్త కంకణం కట్టుకుని పార్టీ కోసం పని చేయాలి.

కేటీఆర్‌ను ఏసీబీ పిలుస్తుందనే రైతుల ముసుగు వేసుకుంటున్నారు

: సీతక్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి

మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ పిలుస్తుంది కాబట్టే బీఆర్ఎస్ నేతలు రైతుల ముసుగు వేసుకుంటున్నారు. అధికారంలో ఉన్నప్పుడు బీసీలు, రైతులు కనిపించలేదా. ఇప్పుడెందుకు కల్లిబొల్లి మాటలు చెబుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కొందరు సహకరించక పోవడంతోనే ఓడిపోవాల్సి వచ్చింది. అక్షింతలు చాలు అభివృద్ధి వద్దంటూ బీజేపీకి ఓటు వేశారు. నియోజక వర్గ స్థాయి నేతలు అందరిని కలుపుకుని ముందుకు పోవాలి. నామినెట్ పదవులపై ఏకాభిప్రాయం ఉండాలి. పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికే ప్రాధాన్యం ఉంటుంది.

కేసులకు భయపడం : ఎమ్మెల్సీ కవిత



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కవిత

ఇంద్రవెల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉమ్మడి జిల్లాపర్యటనలో భాగంగా ఎమ్మెల్సీ కవిత ఇంద్రవెల్లికి చేరుకుని ఆదివాసీ గిరిజన అమరవీరుల స్థూపం వద్ద అమర వీరులకు ఘననివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి కోసం ఆదివాసులు పోరాడారని, కేసీఆర్ హయాంలో నాలుగున్నర లక్షల పోడు భూములకు పట్టాలు ఇచ్చామన్నారు. ఆదివాసి యోధులను గౌరవించుకున్నామని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు కేసులకు భయపడరని స్పష్టం చేశారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, ప్రజల హక్కుల కోసం పోరాటం కొనసాగుతూనే ఉంటుందన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, మహిళలతోపాటు అన్ని వర్గాలకు అన్యాయం జరుగుతున్నదని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారం సందర్భం రైతుభరోసా కింద రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు రూ.12వేలు ప్రకటించి రైతులను మోసం చేశారని విమర్శించారు. దీనికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్దఎత్తున ధర్నాలు చేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ధర్నాలకు భయపడిన ప్రభుత్వం అక్రమ కేసులతో వేధిస్తుందని చెప్పారు. ప్రజాకోర్టులో కాంగ్రెస్ ప్రభుత్వానికి శిక్ష తప్పదని పేర్కొన్నారు.

ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే

నేరడిగొండ : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం నేరడిగొండ మండల కేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఆమెకు పూలమొక్క అందజేసి ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే సతీమణి హరిప్రియ కవితకు తిలకం దిద్దారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఫొటోలు దిగారు. నియోజక వర్గంలోని ఆయా మండలాల నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ కవితతో సెల్ఫీలుదిగారు. ఆ తర్వాత భారీ కాన్వాయితో ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించేందుకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో బోథ్ నియోజక వర్గంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ కుటుంబసభ్యులతో ఎమ్మెల్సీ

రైతు సమస్యలు విన్నవించిన నాయకులు

తలమడుగు : ఎమ్మెల్సీ కవిత సోమవారం జిల్లా పర్యటనకు రావడంతో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో బీఆర్ఎస్ పార్టీ రైతు సంఘం జిల్లా నాయకులు కాటిపెల్లి శ్రీనివాస్ రెడ్డి, మండల కన్వీనర్ వెంకటేష్, అబ్దుల్లా కాటిపల్లి సునీత రెడ్డి, కిరణ్ కుమార్, మాజీ సర్పంచ్ కొచ్చన్నలు కలిసి రైతు సమస్యలను విన్నవించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకొచ్చారు అదే విధంగా రైతులకు పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులు అప్పులపాలు అవుతున్నారన్నారు. అంతేకాకుండా రెండు లక్షల రుణమాఫీ రైతులకు కాకపోవడంతో బ్యాంకుల్లో, వడ్డీ పెరిగి ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు. రైతు సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని వారు సూచించారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

● టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

నేరడిగొండ, జనవరి6 (ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షిలు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ఎన్నికల శంఖారావం పేరిట పార్లమెంట్ నియోజకవర్గస్థాయి సమావేశానికి వెళ్తుండగా రోల్‌మామడ టోల్ ప్లాజా వద్ద కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజక వర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ ఆధ్వర్యంలో నియోజ వర్గ నాయకులు, కార్యకర్తలు వారికి స్వాగతం పలికారు. పూలబొకేలు అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు. పాత, కొత్త నాయకులు కలిసి అందరు పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం భారీ కాన్వాయ్‌తో ఆదిలాబాద్‌కు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు పసుల చంటి, ఆడే వసంత్‌రావ్, బద్దంపోతారెడ్డి పాల్గొన్నారు.



మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన నాయకులు

ప్రతీ కార్యకర్తకు గుర్తింపు

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతికార్యకర్తకు తప్పకుండా గుర్తిస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డు ఆవరణలో సోమవారం జరిగిన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ ముఖ్యఅతిథిగా హాజరై సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ముందుగా ఎమ్మెల్యే సమక్షంలో జిల్లా మార్కెటింగ్ అధికారి గజానన్ ఆధ్వర్యంలో చైర్మన్ ముఖడే ఉత్తం, వైస్‌చైర్మన్ సోయం మారుతిలతో పాటు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన చైర్మన్, వైస్‌చైర్మన్, డైరెక్టర్లకు శాలువాకప్పి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీలతో పాటు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. పదవులు రాని వారు ఎవరూ నిరాశ పడవద్దని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు కార్యకర్తలకు అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, మార్కెట్ కార్యదర్శి దేవన్న, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ డోంగ్రే మారుతిపటేల్, మెస్రం నాగనాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

సబ్బండవర్గాల మేలు కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ పేర్కొ న్నారు. సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో 90 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, డీసీసీ అదక్షులు విశ్వప్రసాద్, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో భాస్కర్ రావులున్నారు.

ఉట్నూర్: పుష్య మాసాన్ని పురస్కరించుకొని ప్రతియేడాది వెడ్మ పరివార్ కుటుంబ సమేతంగా నిర్వహించే పూజ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ పేర్కొన్నారు. సోమవారం ఉట్నూర్ మండలం సుద్దాగూడ గ్రామంలో నిర్వహించిన వెడ్మపరివార్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఆదివాసులకు పుష్యమాసం చాలా పవిత్రమైనదని, ఎంతో భక్తి శ్రద్ధలతో నియమ నిష్ఠలతో కుటుంబాల, తరాల వారీగా దేవతలను దర్శించుకోవడం తరతరాలుగా వస్తున్న ఆచారమని పేర్కొ న్నారు. వెడ్మపరివార్ వారు నిర్వహించే పూజకార్యక్రమాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని పెద్దలను కోరారు. ఆదివాసీల సంస్కృతి సాంప్రదాయాలు చాలా గొప్పవని అన్నారు. నేటి యువతి, యువకులు సంస్కృతి సాంప్రదాయాలను మరువకూడదన్నారు. ప్రతిఒక్కరూ తమ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకొని, భావితరాలకు అందించాలన్నారు.

గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయండి

● లేదంటే ఎన్నికలు బహిష్కరిస్తామని ఆదివాసీ గిరిజనుల హెచ్చరిక



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆదివాసీ గిరిజనులు

తలమడుగు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం. ఉమ్మడి గ్రామపంచాయతీ బరిలోని అనుబంధ గ్రామాలైన టోకిగూడ, షేర్‌గూడ గ్రామాలను కలిపి కొత్త గ్రామపంచాయతీ ఏర్పాటు చేయకుంటే వచ్చే గ్రామపంచాయతీ ఎన్నికలను బహిష్కరిస్తామని ఆదివాసి గిరిజనులు డిమాండ్ చేశారు. సోమవారం టోకీగూడ, షేర్‌గూడ గ్రామాలకు చెందిన ఆదివాసి గిరిజనులు తలమడుగు తహసీల్దార్ రాజమోహన్, జిల్లా కలెక్టర్, మంత్రి సీతక్కలకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండుగ్రామాలను కలిపి కొత్త గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలని పలు మార్లు అధికారులు ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. కాగా ఇటీవల ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన పొన్నగూడ గ్రామ పంచాయతీలో రెండు గ్రామాలను కలపడంతో తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. పొన్నగూడ గ్రామ పంచాయతీకి వెళ్లాలంటే దాదాపు నాలుగు నుంచి ఐదుకిలోమీటర్ల వరకు దూరమవుతుందన్నారు. షేర్‌గూడ, టోకిగూడ గ్రామాల్లో దాదాపు 1200 మంది జనాభా ఉన్నారు. 750 ఓటర్లు ఉన్నారు. కావున తమపై దయతలచి కొత్త గ్రామపంచాయతీ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. లేని పక్షంలో త్వరలో జరుగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలను ముక్కుముడిగా బహిష్కరిస్తామని హెచ్చరించారు.

ప్రత్యేక ఎస్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని వినతి

నేరడిగొండ, జనవరి6 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో ప్రత్యేక ఎస్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని కోరుతూ టీపీసీసీ మహేశ్‌కుమార్‌గౌడ్‌ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. లంబాడీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఆదిలాబాద్ జిల్లా గిరిజన ఆదివాసీ విద్యార్థుల సమస్యలను ప్రతిబింబిస్తూ ప్రత్యేక ఎస్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని, గిరిజన ఆదివాసీ విద్యార్థుల కోసం వందశాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన ఆదివాసీ విద్యార్థులు 400-500 కి.మీ దూరం ప్రయాణించి చదువుకునేందుకు వెళ్లాల్సి వస్తుంది. ఈ ప్రయాణం వల్ల వారు పోటీ పరీక్షల శిక్షణ, వసతి, ఆహారం, అధ్యయన వనరులు వంటి అవసరాలు సమర్థవంతంగా పొందలేకపోతున్నారు. గిరిజన విద్యార్థులకు వందశాతం సీట్లు కేటాయించాలని కోరారు. అందుకు తగిన శిక్షణ, వసతి, ఆహారం, ఇతర సౌకర్యాలను అందించాలని వారు కోరారు. వినతి పత్రం అందించిన వారిలో లైవ్ మండలం అధ్యక్షుడు రాథోడ్ సందీప్, సభ్యులున్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన స్పెషల్ ఆఫీసర్

బోథ్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉర్దూ పాఠశాలను సోమవారం మండల ప్రత్యేక అధికారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న బియ్యం నిల్వలను తనిఖీ చేయడంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అంతేగాక విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహారం రుచి చూడడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన విద్యా బోధన సక్రమంగా జరగాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుకి సూచించారు.

మర్లపల్లి రోడ్డుపై క్వాలిటీ కంట్రోల్ అధికారుల తనిఖీ

బోథ్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మర్లపల్లి గ్రామానికి గత ఏడాది వేసిన రోడ్డుకు సంబంధించిన శాంపిళ్లను సోమవారం ఉదయం క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. రోడ్డుపై వేసిన బీటీ, కంకర శాతం ఏ మేరకు ఉందని పరిశీలించేందుకుగాను శాంపిళ్లను సేకరించారు. ప్రతి రెండు కిలోమీటర్లకు ఒకచోట శాంపిళ్లను సేకరించారు.

ఆల్ఇండియా ఫెడరేషన్ జెండావిష్కరణ

ఉట్నూర్, జనవరి6(ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ ఆలిండియా ఫెడరేషన్ ఏర్పడిన రోజు పురస్కరించుకొని సోమవారం ఉట్నూరు మండల కేంద్రంలో రాష్ట్ర అధ్యక్షురాలు సునిత ఆల్ఇండియా ఫెడరేషన్ జెండాను ఆవిష్కరించారు. దేశంలో అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టులలో సోమవారం జెండావిష్కరణ చేశామని సునీత అన్నారు. కార్యక్రమంలో, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి, రత్నమాల, ప్రాజెక్టు కార్య దర్శి, టి.ముక్త అంగన్‌వాడీ నాయకులు సుభద్ర, పార్వతి, సుజాత, పద్మ, కళావతి, రేణుక, అంబుభాయ్, స్వర్ణలత, డి విజయ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల డైరీ..

భోథ్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ట్రెజరీ కార్యాలయం వద్ద సోమవారం రిటైర్డ్ ఉద్యోగుల డైరీని ట్రెజరీ అధికారి విద్యాసాగర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగుల మండల ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రిటైర్డ్ ఉపాధ్యాయుల గ్రాట్యువిటి కమ్యూనికేషన్ టీజీఎల్ఐ డబ్బులు ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల రిటైర్డ్ ఉద్యోగుల వైస్ ప్రెసిడెంట్ ఎం.మురళితోపాటు సభ్యులు రావుల గణపతి, పి. దివాకర్ రెడ్డి, బి. గోవర్ధన్, ఎస్. సుధాకర్, ప్రేమ్ సింగ్, గంగాధర్ పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ఆదిలాబాద్‌అర్బన్, జనవరి6 (ఆంధ్రజ్యోతి):2025-26 విద్యా సంవత్సరానికి నూతన ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 10వ తరగతి వరకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా నేరుగా అప్లయి చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు ప్రవేశ పరీక్ష కోసం ఈ నెల 6 నుంచి ఫిబ్రవరి 28 వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. సంబంధిత పోషకులు ఈ విషయాన్ని గమనించి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

తాంసి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం వర్షాకాలం అయినందున దోమల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయని ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చూడాలని తాంసి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సూపర్‌వైజర్ తులసీరామ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలస్థాయి ఆశవర్కర్లతో ప్రత్యేక సదస్సును ఏర్పాటు చేశారు. ముందుగా పలు విషయాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా ఏవైనా వ్యాధులు వ్యాపిస్తే వెంటనే ప్రభుత్వ వైద్యాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆదేశించారు. ఆశా వర్కర్లు వారి వారి విధులను బాధ్యతయుతంగా నిర్వహించాలని అన్నారు. విధుల విషయంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

● సీపీవో వెంకటరమణ

తాంసి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించినప్పుడే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని సీపీవో వెంకటరమణ అన్నారు. సోమవారం తాంసి మండల కేంద్రంలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం ఏ మేరకు ఉందో అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల పనివేళలు ఏ విధంగా ఉన్నాయో క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేలా ఉపాధ్యాయులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించినప్పుడే మంచి ఫలితాలు సాధిస్తారని, ఈ విషయంలో ప్రతి ఒక్కరు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటి నుంచే రానున్న పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా పలు విషయాలపై అవగాహన కల్పించారు.

కేసీఆర్ పాపం వల్లే రుణమాఫీ కాలేదు

మావల, జనవరి6 (ఆంధ్రజ్యోతి):

గత ప్రభుత్వం రేషన్‌కార్డులు ఇవ్వలేదు..

వెడ్మబొజ్జు (ఎమ్మెల్యే, ఖానాపూర్)



గతంలో కేసీఆర్ చేసిన పాపాలవల్లే రుణమాఫీ కాలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రేషన్‌కార్డులు ప్రతి కుటుంబానికి ఇవ్వలేదు. దాని వల్లనే కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హయాంలో ఇచ్చిన హామీ మేరకు వంద శాతం రుణమాఫీ జరిగింది. గ్రామాల్లో కార్యకర్తలు రుణమాఫీపై చర్చించాలి. వెంటనే డీసీసీ, మండల స్థాయి కమిటీలను వేసి పార్టీని బలోపేతం చేయాలి. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంలో ఓడిపోవడానికి అసలు కారణం ఏమిటో అధిష్ఠానం విశ్లేషణ చేయాలి. కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి.

పార్టీకి కార్యకర్తలే ముఖ్యం...

● ఐకేరెడ్డి (మాజీమంత్రి)



కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే ముఖ్యం. గడిచిన ఏడాదికాలంలో ప్రభుత్వం చేపటిన పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ప్రజలకు, ప్రభుత్వానికి కార్యకర్తలు సమన్వయకర్తలుగా ఉండాలి. గ్రామ, బూత్‌కమిటీ, మండల కమి టీలు వేసుకుని పార్టీని మరింత పటిష్ఠం చేయాలి. స్థానిక సంస్థల్లో గెలిచిన తర్వాత అభివృద్ధి సంక్షేమ పథకాలకు పూర్తి సమయాన్ని కేటాయించాలి. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం మరోసారి చర్చించి నిర్ణయం తీసుకోవాలి.

కాంగ్రెస్ కార్యకర్తలు నిరాశతో ఉన్నారు..

● ఆడేగజేందర్

(బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ)

ఇందిరమ్మ కమిటీలలో ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలకు అవకాశం ఇవ్వడంతో కాంగ్రెస్ కార్యకర్తలు నిరాశతో ఉన్నారు. కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు ప్రాధాన్యతను ఇవ్వాలి. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రాధాన్యతను ఇస్తేనే రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో విజయం దక్కుతుంది.

రూ.2 లక్షలు మించిన రుణాలపై ఆలోచించాలి..

● కుచాడి శ్రీహరిరావు

(నిర్మల్ నియోజక వర్గ ఇన్‌చార్జి)

2 లక్షలకు పైగా ఉన్న రుణాలపై ప్రభుత్వం మరోసారి పునరాలోచన చేయాలి. ఇందిరమ్మ ఆత్మీయ రైతుభరోసా పేరుతో రూ.12వేల ఆర్థిక సహాయం అందివ్వడం జరుగుతుంది. సంక్రాంతి నుంచి అన్ని సంక్షేమ పథకాలను ప్రారంభిస్తాం. కాంగ్రెస్ 13 నెలల పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. పదేళ్ల బీఆర్ఎస్ పాలనను ఎండగడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై గ్రామాల్లో చర్చించాలి. ఇప్పటికే ఇచ్చిన మాట ప్రకారం అన్ని రకాల పథకాలను అమలు చేయడం జరుగుతుంది.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి..

● కంది శ్రీనివాస్‌రెడ్డి

(ఆదిలాబాద్ నియోజక వర్గ ఇన్‌చార్జి)

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు కాంగ్రెస్ శ్రేణులు సమయాత్తం కావాలి. గడిచిన ఏడాదిలోనే ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుంది. కార్యకర్తలు పనిగట్టుకుని ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. గ్రామాల్లో విభేధాలను వీడి పార్టీ అభ్యర్థుల కోసం పనిచేయాలి. నియోజకవర్గంలో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీలను గెలిపించుకునే బాధ్యత నాది. అందరు పార్టీ కోసం పని చేయండి. మునుపెన్నడు లేని విధంగా ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ అధిక స్థానాల్లో విజయం సాధించాలి. నమ్ముకున్న కార్యకర్తలకు పార్టీ న్యాయం చేస్తుంది.

కాంగ్రెస్ జెండా ఎగరాలి..

● దండేవిఠల్ (ఎమ్మెల్సీ ఆదిలాబాద్)

గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్ఠం చేసుకుని రానున్న స్థానికఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురాలి. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటుందో గ్రామస్థాయి వరకు ఆ పార్టీ అభ్యర్థులనే గెలిపిస్తే మరింత అభివృద్ధి సాధిస్తుంది. నేతలు విభేదాలు వీడి పార్టీ కోసం పనిచేస్తేనే గెలుపు సాధ్యమవుతోంది. ముఖ్యంగా ఏడాది కాలంలోనే ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుంది.

సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలి

● ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా

ఉట్నూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ప్రజలసమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కార్యాలయ చాంబర్‌లో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. నిర్మల్ మండలం ముజేలి గ్రామానికి చెందిన ముత్యం తనకి బర్రెల రుణం మంజూరు చేయమని, సిర్పూర్(యూ) మండలం రాగపూర్ గ్రామానికి చెందిన లింగ ఆర్ఓఎఫ్ ఆర్ పట్టా ఇప్పించాలని,నిర్మల్ మండలం ముజేలి గ్రామానికి చెందిన గంగవ్వ కిరాణా దుకాణం రుణం మంజూరు చేయించాలని కోరారు. పలు శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు.

సహకార సంఘంలో చోరీ

తలమడుగు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చొరబడి తాళం పగలగొట్టి సంఘంలో గల దాదాపు 50 వేల రూపాయలు నగదును దోచుకెళ్ళినట్లు సిబ్బంది తెలిపారు. సోమవారం ఉదయం సిబ్బంది విధులకు హాజరుకాగా. సంఘటనకు సంబంధించిన కార్యాలయంలో తాళాలు పగులగొట్టి ఉండగా సిబ్బంది కార్యక్రమంలోనికి వెళ్లి చూడగా కార్యాలయంలో ఎరువులు విక్రయించగా వచ్చిన 50 వేల రూపాయలు దుండగులు తీసుకెళ్లినట్లు సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా.. ఒకరి మృతి

నేరడిగొండ, జనవరి6 (ఆంధ్రజ్యోతి):ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడిన దుర్ఘటనలో గయి సుధాకర్(27) అనే యువకుడు మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. నాగమల్యాల్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గయిబీముడు కొడుకైన గయిసుధాకర్ సోమవారం తన సొంత ట్రాక్టర్‌లో గ్రామ సమీపంలో గల వాగులో ఉసికను తీసుకువచ్చే క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి గోవిందూర్ గ్రామ సమీపంలో రోడ్డు పక్కన గుంతలో పడడంతో ట్రాక్టర్‌చక్రాల కిందకి పడి సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య కొడుకు ఉన్నాడు. సుధాకర్ మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. అకాల మృతి చెందడంతో భార్య తల్లిదండ్రుల రోధనలు మిన్నంటాయి.

రైతులందరూ పంటల వివరాలు

ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

తలమడుగు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రబీ పంటలు సాగు చేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలని వ్యవసాయం శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్ కిషన్ కోరారు. సోమవారం మండలంలోని వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రబీ పంటలు సాగు చేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. పంటలను విక్రయించే సమయంలో రైతులు. ఇబ్బందులు పడకుండా ముందస్తుగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా రబీ పంట రైతులకు ఇలాంటి ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. రైతు సోదరులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో ఆధార్ కార్డు లింకుతో ఎరువులను కొనుగోలు చేయాలన్నారు. రైతులకు పంట సాగులో ఎలాంటి సమస్యలు ఉన్న గ్రామాల్లో గల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సీఈవో మోతే శ్రీనివాస్. వ్యవసాయ అధికారి. ప్రమోద్ రెడ్డి. సిబ్బంది. సాగర్. భీమావు. సత్య నారాయణ. తదితరులు పాల్గొన్నారు.

ఘటా.. ఘట్...

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నాం

● సి.విలాస్‌కుమార్, ఐసీటీసీ కౌన్సిలర్ ఏరియా ఆసుపత్రి, భైంసా



భైంసా ఏరియా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నామని ఐసీటీసీ కౌన్సిలర్ సి.విలాస్‌కుమార్ తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు. మరిన్ని వివరాలు ..

ప్రశ్న: ఏయిడ్స్ వ్యాధి వ్యాప్తి నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

జవాబు: వ్యాధి వ్యాప్తి నియంత్రణ కోసం గానుక్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు, చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నాం. కరపత్రాల పంపిణీ ద్వారా విస్తృత ప్రచారం గావిస్తున్నాం. ఏరియా ఆసుపత్రిలో నిత్యం కౌన్సిలింగ్ కార్యక్రమాలను చేపడుతున్నాం. ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తూ జనాలను జాగృత పరుస్తున్నాం.

ప్రశ్న: డివిజన్ పరిధిలో ఎయిడ్స్ కేసుల నమోదు పరిస్థితి ఏ విధంగా ఉంది ?

జవాబు: గతంతో పోల్చిచూస్తే ప్రస్తుతం వ్యాధి వ్యాప్తి క్రమక్రమంగా తగ్గుతోంది. డివిజన్ పరిధిలో 2022-23 సంవత్సరములో 3,216 మంది వ్యాధి నిర్ధారిత పరీక్షలు చేపట్టగా 19 మందికి, 2023-24 సంవత్సరములో 4,227 మందికి పరీక్షలు నిర్వహించగా 46 మందికి ఎయిడ్స్ వ్యాధి సోకినట్లుగా నిర్ధారణ అయింది. ఇక 2024-25 సంవత్సరములో ఇప్పటి వరకు 3,916 మందికి పరీక్షలు చేపట్టగా 23 మందికి వ్యాధి సోకినట్లుగా నిర్ధారణ జరిగింది

ప్రశ్న:వ్యాధి సంక్రమణ ఎలా జరుగుతుంది.?.

జవాబు: ఒకరి కంటే ఎక్కువ మందితో సంభోగంలో పాల్గొనడంతో పాటు రక్తమార్పిడి, తల్లి నుంచి బిడ్డకు, కలుషిత సిరంజీ వినియోగం వలన వ్యాధి సంక్రమిస్తుంది.

ప్రశ్న: హెచ్ఐవీ నిర్ధారణ ఎలా చేపడుతారు.?.

జవాబు: ఎయిడ్స్ హెచ్ఐవీ అనే వైరస్ వల్ల వస్తుంది. ఈ వ్యాధి సోకితే శరీరంలో రోగ నిరోధక శక్తి దెబ్బతింటుంది. తద్వారా ఎయిడ్స్ ఆహ్వానిత వ్యాధుల బెడద మొదలవుతుంది. రక్త పరీక్ష చేసిన సమయంలో రోగ నిరోధక శక్తి బాగా క్షీణించినపుడు వ్యాధి లక్షణాలు త్వరగా బయటపడుతాయి. వీటి నిర్ధారణ కోసం సీడీ4 పరీక్షల్లో కణాల సంఖ్య 200 కంటే తక్కువగా ఉన్నప్పుడు ఈ వ్యాధి సోకినట్లుగా గుర్తిస్తారు.

● (ఆంధ్రజ్యోతి, భైంసా)

రోడ్డు భద్రత .. జీవితానికి రక్షణ

● ఆర్‌టీసీ ఆర్‌ఎం సోలోమన్, ఎంవీఐ ఈశ్వర్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌టీసీ ఆర్‌ఎం సోలోమన్

భైంసా, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమావళిని పాటిస్తే ప్రమాదాలు తగ్గి జీవితాలకు రక్షణ చేకూరుతుందని ఆదిలాబాద్ ఆర్‌టీసీ రీజనల్ మేనేజర్ సోలోమన్, రవాణశాఖ మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ ఈశ్వర్‌సింగ్‌లు అన్నారు. భద్రతా మాసోత్సవాలలో భాగంగా సోమవారం భైంసా బస్టాండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అజాగ్రతగా వాహనాలను నడుపడం, రోడ్డు భద్రతా నియమావళిని విస్మరించడం మూలంగానే ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని వివరించారు. కొన్ని సందర్భాలలో వాహన కండీషలతో పాటు మరికొన్ని ఇతర కారణాలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పాదచారులు సైతం ట్రాఫిక్ నియమావళికి అనుగుణంగానే నడుచుకోవాలని సూచించారు. చోదకులు వాహనాలను నడిసే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడుపరాదన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, పక్క వారితో మాట్లాడుతూ వాహనాలు నడిపితే ప్రమాదాలు చోటు చేసుకుంటాయన్నారు. మూల మలుపుల వద్ద , ముందరి వాహనాలను ఓవర్ టేక్ చేసే సమయంలో జాగ్రత్తగా వాహనాన్ని నడపాలన్నారు. ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ , నాలుగు చక్రాల వాహన చోదకులు సీట్ బెల్ట్ విధిగా ధరించాలని పేర్కొన్నారు. ఇందులో భైంసా టౌన్ ఎస్ఐ గౌస్ పాషా, డిపో మేనేజర్ హరిప్రసాద్‌తో పాటు ఆర్‌టీసీ సిబ్బంది, అధికారులు, ప్రయాణీకులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడు, మాజీ మంత్రిని

సన్మానించిన మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ

నిర్మల్ అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్‌లో సోమవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ స్థాయి సమావేశంలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షులు బొమ్మమహేష్‌కుమార్‌గౌడ్, తాజా మాజీ మంత్రి వర్యులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్, ఆదిలాబా జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర నాయకులు రంగు నాగరాజ్ గౌడ్, కే. సత్యనారాయణ గౌడ్, బాలసాని నారాయణ గౌడ్, జిల్లా నాయకులు జగదీష్ గౌడ్, దినేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఫొటోతో సెల్ఫీ దిగి నిరసన



నిర్మల్ రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చే యాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన ఉద్యోగుల నిరసన సోమవారం నాటికి 28వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా సోమవారం ఉద్యోగులు సీఎం ఫోటోతో సెల్ఫీ దిగి నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగులను తొలగిస్తామంటూ ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తుందని, ఎన్నికల ముందు మాట ఇచ్చి ఇప్పుడు తప్పడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం సభ్యులు గంగాధర్, నమిత, దశరథ్, గణేష్, విష్ణు, క్రాంతి కుమార్, విఠల్, లతాదేవి, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ ఉత్సవాలు ఆనందాన్ని పంచుతున్నాయి

నిర్మల్ కల్చరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ ఉత్సవాలు మనసుకు ఆనందాన్ని నింపుతున్నాయని నిర్మల్ ప్రముఖ కవులు పేర్కొన్నారు. నిర్మల్ జిల్లాలోనే మొదటి నిర్మల్ ఉత్సవాలు జరగడం చాలా సంతోషదాయకమని సాంస్కృత భాష ప్రచార సమితి ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వ్యవస్థాపక అధ్యక్షులు బి.వెంకట్ అన్నారు. నిర్మల్ ఉత్సవాలు ప్రపంచ వారసత్వమునకు ఒక కొత్త ఉదాహరణగా మిగులుతున్నాయన్నారు. నిర్మల్ వైభవాన్ని చాటి చెప్పే విధంగా వివిధ స్టాళ్లను నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఏర్పాటు చేసినందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రముఖ కవులు - తెలంగాణ రచయితల వేదిక నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, ఉపాధ్యక్షులు డా. ఉప్పు కృష్ణంరాజు, కవియాత్రి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు కారం శంకర్, పద్యకవి డా. మురళీధర్, సొసైటీ అధ్యక్షులు మునిమడుగుల రాజారావు, నిర్మల భారతి సాంస్కృతిక కళా సామాజిక సేవా క్షేత్రం అధ్యక్షులు తోడిశెట్టి పరమేశ్వర్‌లు నిర్మల్ ఉత్సవాల వివిధ స్టాళ్లను సందర్శించారు. హెర్బల్ ఆయుర్వేద స్టాల్‌ను నిర్వహిస్తున్న డా. ఉమేష్ గుప్తా కవులకు హెర్బల్ టీ రుచిని చూపించారు. ముథోల్ రబీంద్ర ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ సాయినాథ్ ఆధ్వర్యంలో చంద్రయాన్ విజ్ఞాన ప్రదర్శన ఆకట్టుకునేదని కవులు అన్నారు. ప్రిన్సిపాల్ డానియల్ ఆధ్వర్యంలో తెలంగాణ గురుకుల బాలికల విద్యాలయం జూనియర్ కళాశాల విద్యార్థినులు ఏర్పాటు చేసి ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కాగితాల బొమ్మలు చాలా బాగున్నాయన్నారు. ఐలవ్‌యూ నిర్మల్ లైటింగ్ ఆకృతి, సెల్ఫీ పాయింట్, డా.కావేరి ఫౌండేషన్ చైర్మన్ డా.అప్పాల చక్రధారి ఆధ్వర్యంలో నిర్మల్ చరిత్ర సాంస్కృతిక ఆనవాళ్ల స్టాల్ బాగుతున్నాయన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కళా కార్యక్రమాలు బాగున్నాయన్నారు. ప్రపంచ స్థాయికి నిర్మల్ చరిత్రను తీసుకువెళ్తున్న నిర్మల్ జిల్లా కలెక్టర్ చాలా అభినందనీయురాలని అన్నారు. ప్రతి ఒక్కరూ నిర్మల్ ఉత్సవాలను తిలకించి, ఆనందాన్ని పొందాలన్నారు.



బి.వెంకట్‌కు బొకే అందజేస్తున్న దృశ్యం

బీడీ కార్మికులకు నెలకు 26 రోజుల పని కల్పించాలి

కలెక్టర్ కార్యాలయం ముందు భారీ ధర్నా



కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న బీడీ కార్మికులు

నిర్మల్ అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : శివాజీ బీడీ యాజమాన్యం జిల్లాలో బీడీ కార్మికులకు నెలకు 26 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం రోజు కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్న మాట్లాడుతూ... శివాజీ బీడీ యాజమాన్యం బీడీ కార్మికులకు 26 రోజుల పని కల్పించకుండా కేవలం పది రోజులు రోజుకు సగం దినం పని మాత్రమే కల్పిస్తున్నారని కార్మికులందరికీ నెలకు 26 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం. జిల్లాలో ఒకే బీడీ యజమాని రెండు రకాల పని దినాలు ఇస్తుంటే కార్మికులు గందరగోళానికి గురి అవుతున్నారని, వారిని ఆదుకోవాలని కోరారు. పని కల్పించని యెడల బీడీ, చుట్ట కార్మికుల చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పీఎఫ్ ఐడీ కార్డులు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ అడిగిన వారిని కక్ష సాధింపు చర్యలకు గురిచేస్తూ కార్మికులు ఏళ్ల తరబడి బీడీలు చేస్తే సర్వీస్ చెల్లించే క్రమంలో యాజమాన్యం కార్మికులకు సరైన పద్ధతిలో సర్వీస్ (గ్రాట్యూటీ) చెల్లించకుండా కేవలం ఎంతో కొంత పద్దుముట్ట జెప్పి కార్మికులను ఈ విధంగా కూడా దోపిడీ చేస్తున్నారు. వీరి దోపిడీని అరికట్టాలని కోరారు. పై సమస్యలను పరిష్కరించుటకై ఏసీఎల్, డీసీఎల్‌తో బీడీ యాజమాన్యాన్ని పిలిపించి జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి కార్మికుల సమస్యలను పరిష్కరించవలసిందిగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎం. బక్కన్న, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రామలక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. గంగన్న, జిల్లా నాయకులు కే. లక్ష్మీ, సుజాత, లావణ్య, సునీత, రమేష్, గంగాధర్, గజ్జారాం, ముత్యం, సత్యం, గంగాధర్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో సీసీ రోడ్డు నిర్మించిన గురుకుల అధ్యాపకుడు



బాబాపూర్ శివాలయం వద్ద సీసీ రోడ్డును నిర్మిస్తున్న దృశ్యం

లక్ష్మణచాంద, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : బుర్క రాజేందర్ అనే మహాత్మాజ్యోతి బాపూలే కళాశాల గురుకుల అధ్యాపకుడు తన సొంత నిధులతో సోమవారం సీసీ రోడ్డు నిర్మించాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బాబాపూర్‌లోని శ్రీ రాజరాజేశ్వర ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం రూ. 1 లక్షను వెచ్చించి 12 మీటర్ల వెడల్పు 15 మీటర్ల పొడవుతో ఈ రోడ్డును నిర్మించాడు. కాగా రాజేందర్ ఇటీవలే విడుదలైన ఫలితాలలో మహాత్మా జ్యోతి బాపూలే కళాశాల అధ్యాపకుడిగా ఎంపిక కావటం గమనార్హం.

ఆటో డ్రైవర్లకిచ్చిన హామీలను అమలు చేయాలి

భైంసా, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హమీలను వెంటనే అమలులోకి తీసుక రావాలని జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు సుంకెట మహేష్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం సంబంధిత విషయంలో ఆటోడ్రైవర్లతో కలిసి భైంసా ఆర్‌డీవో కార్యాలయంలో పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు సుంకెట మహేష్‌బాబు మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షుని హోదాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ప్రతి యేటా రూ.12 వేలు జీవన భృతిగా అందిస్తామని హమీనిచ్చారని పేర్కొన్నారు. వీటితో పాటు మరికొన్ని హమీలను సైతం అందించారని వివరించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తయినప్పటికి ఆటోడ్రైవర్లకు ఇచ్చిన ఒక్క హమీ కూడా అమలుకు నోచుకోలేదన్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించేందుకు ప్రవేశ పెట్టిన మహాలక్ష్మీ పథకం ద్వారా ఆటోడ్రైవర్ల జీవన పరిస్థితులు ఆగమ్యగోచరంగా మారాయని అవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబాలు అర్థాకలితో కాలం నెట్టుక రావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఆటో డ్రైవర్లను ఆదుకునేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ వెంటనే వారికి రూ.12 వేల జీవన భృతితో పాటు ఇతర హమీలను అమలు చేయాలన్నారు.

భక్తులతో కిటకిటలాడిన కదిలి క్షేత్రం

దిలావర్‌పూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీ కదిలి పాపహరేశ్వర స్వామి క్షేత్రం భారీగా వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. గోముఖ గుండంలో పవిత్ర స్నానాలు చేసిన భక్తులు పాపహరేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అభిషేక పూజలు చేశారు. శ్రీ మాతాన్న పూర్ణేశ్వరిదేవిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా నర్సాపూర్(జి) మండల కేంద్రానికి చెందిన రుచిత, సతీష్ దంపతులు భక్తులకు అన్నప్రసాదం పెట్టారు.

దిలావర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో

సంపూర్ణ ఆరోగ్యంపై ప్రత్యేక కార్యక్రమం

దిలావర్‌పూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యం, మూర్తిత్వ వికాసం కోసం ఆహ్లాదకరమైన కళాశాల, ఆరోగ్యకరమైన అలవాట్లు అనే వారం రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా వారం రోజులపాటు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రత్యేక సెమినార్ ఏర్పాట్లు చేశారు. సోమవారం వ్యక్తిగత పరిశుభ్రత, మంగళవారం పోషణపై వివరణ, బుధవారం మానసిక ఒత్తిడిని జయించడం ఎలా, గురువారం మాదక ద్రవ్యాల నిర్మూలన, శుక్రవారం మానసిక వికాసం, సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు అనే అంశాలపై సెమినార్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుదర్శన్ తెలిపారు. సోమవారం తెలుగు అధ్యాపకులు టి. విష్ణువర్ధన్ వ్యక్తిగత పరిశుభ్రత అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి. సుదర్శన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన

పెంబి/(ఖానాపూర్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : రైతు భరోసాగా 15 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఖానాపూర్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు పట్టణంలో ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాగా 15 వేలు ఇస్తామని చెప్పి ఇపుడు 12 వేలు ఇస్తామని నిర్ణయించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులు తగ్గించడం సరికాదు

భైంసా, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయని ప్రగల్బాలు పలికే రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ సర్కార్ రైతు భరోసా నిధులు తగ్గించడం ఎంత మాత్రం సరికాదని బీఆర్ఎస్ ముథోల్ సమన్వయ కమిటీ ప్రతినిధిడా.కిరణ్ కోమేవార్ పేర్కొన్నారు. సోమవారం సంబంధిత విషయంలో పత్రికా ప్రకటన విడుదల చేశారు.

అలరించిన ముందస్తు

సంక్రాంతి పర్వదిన వేడుకలు

భైంసా, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అల్ఫోర్స్ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి పర్వదిన వేడుకలు అహుతులను విశేషంగా అలరించాయి. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులు బోగి,కనుమ, సంక్రాంతి పర్వదినాల ప్రాశస్త్యన్ని వివరిస్తూ ప్రదర్శనలు నిర్వహించారు ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మెన్ డా.వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ పర్వదిన వేడుకల ప్రాసస్త్యంపై ప్రతి విద్యార్థి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సంస్కృతి, సంప్రదాయలు, అచార వ్యవహారాలకు అనుగుణంగా పర్వదిన వేడుకలను ఆనందోత్సహాల మధ్య భక్తి,శ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

హోం జిమ్‌లపై పెరుగుతున్న ఆసక్తి

● ఇంట్లోనే కుటుంబమంతటికీ చక్కటి ఆరోగ్యం ● అందుబాటులో ఉన్న పరికరాలతో ప్రత్యేక వ్యాయామశాలల ఏర్పాటు



ఆరోగ్యం

ట్రెడ్‌మిల్‌పై వాకింగ్ చేస్తున్న వైద్యుడు

భైంసా, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇంట్లోనే ఓ చక్కటి జిమ్.. ఇటీవల అన్ని ప్రాంతాల్లోనూ బాగా విస్తరిస్తోన్న ఆలోచన ఇది. గృహం అనుబంధాల సౌధమే కాదు.. ఆరోగ్య వేదికగా కూడా మార్చే సంస్కృతి పెరుగుతుంది. మేడ మీదనో.. ఓ ప్రత్యేక గదినో కేటాయించుకోవడం.. దానిలో కాస్త అందుబాటు ధరల్లో ఉండే పరికరాలను కొనుగోలు చేసి చిన్నపాటి వ్యాయామశాలగా తయారు చేసుకోవడం. కుటుంబ సభ్యులంతా నిర్ణీత వేళల్లో వాటిని ఉపయోగించుంటూ ఆరోగ్యాన్ని కాపాడు కోవడంపై దృష్టి పెట్టారు. దీంతో హోం జిమ్ ఆలోచన ఒక్కో గడపనూ తడుతూ ఇంటిలోకి చేరుతుంది.



ఇంట్లో ఏర్పాటు చేసుకున్న జిమ్ పరికరాలు

గడియారం ముల్లులా క్షణం తీరిక లేకుండా గడపడం అన్ని వర్గాల వారికి రివాజుగా మారింది. అంతటి పని ఒత్తిడిలో తనను తానే పట్టించుకోలేని స్థితికి చేరుకున్నాడు. ఇక వ్యాయామం సంగతి అంటారా.. గుర్తొచ్చినప్పుడో.. స్నేహితుడు పిలిచాడనో.. డాక్టర్ హెచ్చరించాడనో ఓ నాలుగైదు రోజులు ఉదయపు నడకకు వెళ్తుంటారు. తర్వాత ఎండ ఎక్కువగా ఉందనో.. వాన పడుతుందనో.. చలి ఎక్కువగా ఉందనో నడకకు వెళ్లడం మానేస్తారు. నెమ్మదిగా ఆ సంగతే మరిచిపోతుంటారు. ఇదీ సాధారణంగా జరిగే తీరు. హోం జిమ్ ఆలోచనతో దీనికో పరిష్కారం మార్గం దొరికింది.

● అధికమవుతున్న వ్యాధుల బెడద.

మధుమేహం, రక్తపోటు, గుండెపోటు కేసులు బాగా పెరుగుతున్నాయి. మధుమేహంతో బాధపడుతున్న వారి సంఖ్య ఇంతకింతకి పెరుగుతోందని వైద్యుల పరిశోధనల్లో స్పష్టమవుతుంది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులో మధుమేహ రోగులు అధిక సంఖ్యలో వైద్య సేవల కోసం వస్తుంటారు. ఇక రక్తపోటుతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతూ పోతోంది. ఇవన్నీ క్రమబద్ధమైన వ్యాయామం లేకపోవడం వల్ల వస్తున్నవే వీటిని తగ్గించాలంటే ప్రతీ ఒక్కరు రోజుకు కనీసం 45 నిమిషాల పాటు వ్యాయామం ఖచ్చితంగా చేయాలి.

● ఆన్‌లైన్‌లోనూ కొనుగోళ్లు..

చాలా మంది కొనుగోలుదారులు ఆన్‌లైన్ సంస్థల నుంచి పరికరాలను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఆన్‌లైన్ విక్రయ సంస్థల్లో ధరలు కాసింత తక్కువగా ఉండడం, ఇన్‌స్టాలేషన్ కూడా సహకరిస్తుండడంతో సగం మంది కొనుగోలుదారులు ఆన్‌లైన్‌నే ఆశ్రయిస్తున్నారు. వీటిద్వారా కూడా లక్షలాది రూపాయల విలువైన లావాదేవీలు జరుగుతున్నాయి.

● రూ. 50 వేలతో ఇంటిల్లీపాదికి ఆరోగ్యం..

ఇది ప్రతీ ఒక్కరు వినియోగించదగ్గ పరికరం. దీని ద్వారా నడక, జాగింగ్ వంటివి చేయవచ్చు. వీటి ఖరీదు రూ. 15 వేల నుంచి రూ. 40 వేల వరకు ఉంటున్నాయి. కాస్త నాణ్యమైనవి కావాలంటే రూ. 50 వరకు ఉంటున్నాయి. కాస్త నాణ్యమైనవి కావాలంటే రూ. 75 వేల వరకు ఖర్చుపెట్టాలి. హోం జిమ్‌లలో ప్రధాన పరికరం ఇదే ఉంటుంది.



సైక్లింగ్ చేస్తున్న యువకుడు

సైక్లింగ్



దీన్ని కూడా చిన్న పిల్లల నుంచి పెద్దవారి వరకు ఉపయోగించవచ్చని ముఖ్యంగా శారీరక వైకల్యాలు ఉన్నవారు, ఫిజియోథెరపీ వంటివి అవసరమైన వారికి సైక్లింగ్ పరికరం చాలా ఉపయోగపడుతుంది. దీని ఖరీదు నాణ్యతను బట్టి రూ. 6 వేల నుంచి రూ. 15 వేల వరకు ఉంటుంది.

స్కిప్పింగ్ రోప్



ఒళ్లు మొత్తం కదిలేలా చిన్ననాటి ఆటలను గుర్తుకు తెచ్చేది స్కిప్పింగ్ రోప్. ఇది తక్కువ ఖరీదు కావ డంతో హోం జిమ్‌లలో తప్పనిసరిగా చోటు చేసుకుంటుంది. దీని తో నాలుగైదు రకాల వ్యాయామ రీతులను చేయవచ్చు. దీనిఖరీదు రూ. 75 నుంచి రూ. 250 వరకు ఉంటుంది.

డంబెల్స్



రోజువారీ చేసే వ్యాయామంలో డంబుల్స్ కీలకపాత్ర పోషిస్తాయి. చేతి కండరాలకు చక్కని ఆకృతిని తీసు కొస్తాయి. పైగా వీటిని చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరు ఉపయోగించే విధంగా పౌండ్లు, కేజీల వారీగా వివిధ బరువుల్లో లభిస్తున్నాయి. వీటిని ఉపయోగించి కూడా అయిదారు విధాలుగా వ్యాయామాలు చేయవచ్చు.

పుషప్ స్టాండ్



చక్కని శరీరాకృతి నిర్మాణానికి, ఆరోగ్యకరమైన కండర తయారీకి పుషప్స్ స్టాండ్ ఎంతో ఉపకరిస్తుంది. ఇవి యువతకు ఎక్కువగా ఉపయోగపడతాయి. ఇనుప కడ్డీలతో తయారు చేసుకునే పుషప్స్ స్టాండ్‌తో ఇంట్లోనే 10 నుంచి 15 నిమిషాల పాటు వ్యాయామం చేస్తే మంచి ఆకృతి పొందొచ్చు. దీనితో కూడా నాలుగైదు రకాల వర్కవుట్లను చేసే అవకాశం ఉంది. వీటి ఖరీదు రూ. 300 నుంచి రూ.750ల మధ్య ఉంటుంది.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి సీతక్క



రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మహిళా శక్తి క్యాంటిన్‌లో తిను బండారాల రుచి చూస్తున్న మంత్రి సీతక్క, ఎంపీ గొడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, అధికారులు



మావలలో మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క.

ఆదిలాబాద్ రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముందుకు వెళ్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. పేదల అభివృద్ధితోపాటు వారికి సొంత ఇళ్లను ఇచ్చేలా ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. సోమవారం మావల మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ నమూన ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన, భూమి పూజ చేశారు. మోడల్ ఇండ్ల నిర్మాణాల ఫొటోలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అంతకు ముందు రిమ్స్ సూపర్ స్పెషలిటీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మహిళ శక్తి క్యాంటిన్‌ను మంత్రి సీతక్క ప్రారంభించారు. ముందుగా ఆస్పత్రిలోని పలు వార్డులు, పరికరాలను పరిశీలించగా.. వాటి గురించి డైరెక్టర్ వివరించారు. అనంతరం క్యాంటిన్‌ను ప్రారంభించి ఇక్కడి తినుబండారాల రుచులను చూశారు. మహిళాల అభివృద్ధికి ఏర్పాటు చేసిన వీటిన రిమ్స్‌కు వచ్చే రోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అక్కడి నుంచి పట్టణంలో రూ.10 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులకు దస్నాపూర్‌లో శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. ఆరు గ్యారంటీల్లో ఒక్కటైన ఇందిరమ్మ ఇండ్లకు సర్వే కొనసాగుతుందన్నారు. ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పనులపై రివ్యూ లేని కారణంగా ముందుకు సాగడం లేదన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రూ.150 కోట్లతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చొరవతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం అయిందన్నారు.

ట్రాన్స్ జెండర్ల సంక్షేమం కోసం కృషి

సమాజంలో ఓ భాగమైన ట్రాన్స్ జెండర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. సమాజంలో వారిని ప్రతీఒక్కరు గౌరవించాలని సూచించారు. ప్రభుత్వం కూడా వారికి గుర్తింపు ఇస్త సంక్షేమానికి పాటుపడుతుందని వారిపై వివక్ష చూపొద్దని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. రిమ్స్‌లో ట్రాన్స్ జెండర్ల కోసం ఏర్పాటు చేసిన మైత్రి ట్రాన్స్ క్లినిక్‌ను మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ట్రాన్స్‌జెండర్లను గుర్తింపు కార్డులను అందించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లు స్వయం ఉపాధిలో రాణించేలా బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి వంద శాతం సబ్సిడీ రుణాలను అందించాలన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా డీటీసీ రవీందర్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని మంత్రిని ప్రారంభించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా కృషి

అవకాశాలు వస్తే మహిళలు అవలీలగా ఏ రంగంలోనైనా రాణిస్తారని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం పట్టణంలో పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన మహిళ వికాస జిల్లా సమాఖ్య కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి కలిసి ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి మహిళ సమాఖ్య భవనంలోని గదులను పరిశీలించి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్, ఎమ్మెల్సీ దండే విఠల్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, శిక్షణ కలెక్టర్ అభిగ్యాన మలవీయ, ఆర్డీవో వినోద్ కుమార్, కరీంనగర్ గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్, పాల్గొన్నారు.

జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కృషి

మావల: పెండింగ్ సమస్యలను పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి జిల్లా ప్రజా ప్రతినిధుల సహాయ సహకారాలతో జిల్లాను మరింత అభివృద్ధి పథం వైపు ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమ మంత్రి ధనసరి అనసూయ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పర్యటనలు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని పార్లమెంట్ సభ్యులు నగేష్, ఎంఎల్‌సీ దండే విఠల్, ఎంఎల్‌ఏ పాయల్ శంకర్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలంలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మొదటగా రిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌లో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించి, దస్నాపూర్ ప్రాంతంలో 10.53 కోట్ల రూపాయలతో చేపట్టే బీటిఈ రోడ్లు, సీసీ డ్రైన్‌ల నిర్మాణం పనులకు, మావల మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులకు శంఖుస్థాపన చేశారు. అనంతరం దుబ్బగూడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు.

ధైర్యంగా పోరాడండి.. ఆందోళన వద్దు!

● బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షులు నగేష్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): న్యాయమైన డిమాండ్ల కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు పోరాటం న్యాయమైందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్ అన్నారు. సమ్మెను నిర్వీర్యం చేసేలా ఉద్యోగులను ప్రభుత్వం భయభ్రాంతులకు గురి చేస్తుందని, ఎలాంటి ఆందోళన చెందవద్దని ఆయన ఉద్యోగులకు భరోసా ఇచ్చారు. కలెక్టర్ ఎదుట ఉద్యోగులు చేపట్టిన సమ్మె సోమవారం 28వ రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని బార్ అసోసియేషన్ సభ్యులతో కలిసి సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగాల నుంచి తొలగిస్తామంటూ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనపై ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. ఉద్యోగులను తొలగించిన చరిత్ర ఇప్పటి వరకు జరగలేదన్నారు. ఒకవేళ అలాంటి ప్రయత్నం చేస్తే తమ బార్ అసోసియేషన్ అండగా నిలుస్తుందన్నారు. అవసరమైతే ఉచితంగా న్యాయ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ముదిరాజ్ మహసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివయ్య, నాయకులు రాము, సంతోష్, రాజు సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రవీందర్, ప్రియాంక, పార్ధసారథి, మల్లిక పాల్గొన్నారు.

ఆదిలాబాద్ కాంగ్రెస్‌లో బయటపడ్డ విభేదాలు



చించివేసిన ఫ్లెక్సీ

ఆదిలాబాద్ రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీలో ఫ్లెక్సీల చించివేతతో వివాదం నెలకొంది. సోమవారం ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన రాష్ట్ర ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ రావడంతో పార్టీ శ్రేణులు భారీగా ఏర్పాటు చేశారు. అయితే పార్టీలోని వర్గ విభేదాలతో ఒక వర్గం వారు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను.. మరో వర్గం వారు చింపివేసినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రముఖులు వచ్చిన కీలక సమయంలో ఆదిలాబాద్ కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు బయటపడడం చర్చనీయాంశంగా మారింది.

పూర్ణాహుతిలో పాల్గొన్న ఎమ్మెల్యే



పూర్ణాహుతిలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ పట్టణంలోని డైట్ మైదానంలో నిర్వహిస్తున్న విశ్వశాంతి మహాయాగ మహోత్సవం కార్యక్రమంలో పూర్ణాహుతి కార్యక్రమంలో శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామిజీ, ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొన్నారు. దేవుని నామస్మరణతో ఆధ్యాత్మికత అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

స్ట్రెచర్ ఉన్నా.. సిబ్బంది లేక ఇబ్బంది



స్ట్రెచర్‌పై తన కుమారున్ని ఆస్పత్రికి తీసుకొస్తున్న తల్లిదండ్రులు

రిమ్స్‌లో పరిస్థితులు ఇంకా మెరుగుపడడం లేదు. సోమవారం అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఆసుపత్రికి వచ్చారు. అదే సమయంలో ఓ వ్యక్తి రోగిని స్వయంగా స్ట్రెచర్‌పై తీసుకెళ్లారు. అక్కడ సిబ్బంది ఎవరు లేక పోవడంతో రోగి బంధువులే తీసుకెళ్లారు.

(ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫోటోగ్రాఫర్)

21 రోజుల సమ్మె అనంతరం బడిబాట పట్టిన సీఆర్టీలు

● నిమ్మరసం ఇచ్చిన ఎమ్మెల్యే



ఐటీడీఏ ముందు సమ్మె చేస్తున్న సీఆర్టీలు (ఫైల్)

ఉట్నూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్సీ టీచర్లు 21 రోజుల సమ్మె అనంతరం సోమవారం బడిబాట పట్టారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ముందు తమ దీర్ఘకాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేసిన సీఆర్టీలతో జిల్లా ఇన్‌చార్జీ మంత్రి ధనసరి అనసూయ సీతక్క హైదరాబాద్‌లో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఉద్యో గ భద్రత, టైం స్కేల్ మినహా మిగత సమస్యలను పరిష్కరిస్తామని మహిళలకు 108 రోజుల ప్రసూతి సెలవులు ఇస్తామని, సీఆర్టీల కొనసాగింపు ఫైల్‌పై ముఖ్యమంత్రి సంతకం చేశారని త్వరలోనే ఉత్తర్వులు విడుదల చేస్తామని సీతక్క ప్రకటించారు. దీంతో ఆదివారం సీఆర్టీల సమ్మె శిబిరానికి ఖానాపూర్ ఎమ్మెల్యే చేరుకుని నిమ్మరసం ఇచ్చి సమ్మె విరమింపచేశారు. దీంతో 1200 మంది సీఆర్టీలు బడిబాట పట్టడంతో పాఠశాలలకు కల వచ్చింది.

తగ్గుముఖం పట్టిన చలి

● భీంపూర్ మండలం అర్లి(టి)లో 8.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు

ఆదిలాబాద్, జనవరి6 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు పెరగడంతో చలి తీవ్రత కొంత తగ్గుముఖం పట్టింది. సోమవారం జిల్లా సగటు ఉష్ణోగ్రత 30.5 కాగా కనిష్టంగా 11.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.అలాగే అత్యల్పంగా భీంపూర్ మండలం అర్లి(టి)లో 8.9, బోథ్‌లో 9.5, బేలలో 9.8, ఉట్నూర్‌లో 11.0, తలమడుగులో 11.7, మావలలో 12.1, ఇంద్రవెల్లిలో 13.7, గుడిహత్నూర్‌లో 14.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 15 డిగ్రీల లోపే కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సంక్రాంతి వరకు జిల్లాలో చలి ప్రభావం కొంత ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు.

సమ్మెబాటలో.. హమాలీలు



- హామీలు అమలు చేయాలంటూ హమాలీల జంగ్ సైరన్
- నిలిచిపోయిన పౌర సరఫరా వ్యవస్థ
- మూతపడ్డ రేషన్ షాపులు
- బియ్యం కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు
- సర్కారు తన హామీని నిలబెట్టుకోవాలంటూ డిమాండ్

నిర్మల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పౌరసరఫరాలశాఖకు సంబంధించిన గోదాముల్లో పనిచేస్తున్న హామీలీలు సమ్మె శంఖారావం పూరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ హామీలీలు గత వారం రోజుల నుంచి సమ్మెబాట పట్టారు. హమాలీల సమ్మె కారణంగా పౌరసరఫరాల వ్యవస్థ ప్రస్తుతం స్తంభించిపోయింది. గోదాముల్లో బియ్యం లోడింగ్, అన్‌లోడింగ్ నిలిచిపోవడంతో ప్రస్తుతం రేషన్‌షాపులన్నీ మూతపడ్డాయి. ప్రతీనెల మొదటి తారీఖు నుంచే రేషన్‌షాపుల్లో బియ్యం పంపిణీ మొదలయ్యేది. అయితే ఈసారి ఆరవతేదీ దాటుతున్నప్పటికీ ఇప్పటివరకు రేషన్ షాపులు తెరుచుకోలేదు. సమ్మె కారణంగా రేషన్‌బియ్యంపై ఆధారపడ్డ పేద, మధ్యతరగతి వాళ్లంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సివిల్‌సప్లై గోదాముల్లో పనిచేస్తున్న హమాలీల సమస్యలను పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ హమాలీలు అప్పట్లో ఆందోళన చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదు. తాము చాలా ఏళ్ల నుంచి గోదాముల్లో వెట్టి చాకిరి చేస్తున్నామని సంబంధితశాఖ ద్వారా తమకిచ్చే కూలీ డబ్బులు సరిపోవడం లేదంటూ వారంతా ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ వారి గోడు అరణ్య రోదనగానే మారింది. ఈ నేపథ్యంలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ సివిల్ సప్లైస్ గోదాముల్లో పనిచేస్తున్న హమాలీల సమస్యలను పరిష్కరిస్తామంటూ హామీ ఇచ్చింది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నప్పటికీ తమ సమస్యలను పరిష్కరించకపోవడంతో వారంతా సమ్మెకు దిగారు. రోజురోజుకు సమ్మె తీవ్రమవుతోంది. కాగా వీరి సమ్మెకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు ప్రకటించి హమాలీలకు అండగా నిలుస్తోంది.



జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్‌లో మూసి ఉన్న చౌకధరల దుకాణం

డిమాండ్లు అంగీకరించినా జారీ కాని జీవోలు

ప్రభుత్వం సివిల్ సప్లై గోదాముల్లో పనిచేస్తున్న హమాలీల వేతనాన్ని పెంచుతామని హామీ ఇచ్చినప్పటికీ ఆ హామీకి అనుగుణంగా జీవోలు మాత్రం జారీ చేయలేదు. ప్రతీ క్వింటాల్ బియ్యం సంచి లోడింగ్ అన్‌లోడింగ్‌కు ప్రస్తుతం 26 రూపాయలు చెల్లిస్తున్నారు. దీనిని 29 రూపాయలకు పెంచేందుకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. అలాగే దసరా పండగను పురస్కరించుకొని ప్రస్తుతం అందిస్తున్న 6500 రూపాయల బోనస్‌ను పది వేల రూపాయలకు పెంచేందుకు ప్రభుత్వం అంగీకరించింది. అలాగే హమాలీలకు ఐడీ కార్డులు, ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఈ హామీ ఇచ్చి దాదాపు నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం ఇప్పటి వరకు జీవో జారీ చేయకపోవడంతో హమాలీలు సమ్మెకు దిగారు. గత డిసెంబరు 18న హైదరాబాద్‌లో భారీ ధర్నా చేపట్టిన హమాలీలు సమ్మెకు దిగుతామంటూ నోటీసు కూడా అందించారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో ఇక ఉధృతం చేసేందుకు రంగంలోకి దిగారు.

మూతపడ్డ రేషన్ దుకాణాలు

కాగా హమాలీల సమ్మె కారణంగా రేషన్‌షాపులన్నీ మూతపడ్డాయి. కొన్నిషాపుల్లో మాత్రమే గత నెల స్టాక్‌ను పంపిణీ చేసిన డీలర్లు స్టాక్ అయిపోవడంతో తమ దుకాణాలను మూసి ఉంచారు. ప్రతీ నెల మొదటి తేదీన రేషన్ బియ్యాన్ని తీసుకువెళ్లే నిరుపేద లబ్ధిదారులంతా సమ్మె కారణంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బియ్యం రేషన్ దుకాణాల ద్వారా అందకపోతుండడంతో వారంతా ప్రైవేట్ కిరాణా దుకాణాలలో ఎక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో మొత్తం 412 రేషన్ దుకాణాలు ఉండగా 4 లక్షల 50 వేల 661 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ జరుగుతుంది. కాగా జిల్లాలో 55 మంది హమాలీలు ఉండగా ఐదుగురు స్వీపర్లు పని చేస్తున్నారు. నిర్మల్‌తో పాటు ఖానాపూర్, భైంసా, ముథోల్‌లలో మండల్ లెవెల్ స్టాక్ పాయింట్లు కొనసాగుతున్నాయి. అలాగే 951 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, 111 హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూల్స్ 926 అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా మండల్ లెవెల్ స్టాక్ పాయింట్ల నుండే పౌర సరఫరాలశాఖ ద్వారా బియ్యం పంపిణీ జరుగుతుంది. అయితే ప్రస్తుతం హమాలీల సమ్మె కారణంగా వీటన్నింటికీ బియ్యం పంపిణీ నిలిచిపోయింది.

బియ్యం లేక ఇబ్బందులు పడుతున్నాం



ఇంట్లో బియ్యం లేని కారణంగా ఇబ్బందులు పడుతున్నాం. ప్రతీ నెల ఒకటవ తేదీ నుంచి పంపిణీ ప్రారంభమయ్యేది. ఈ నెల ఇప్పటి వరకు పంపిణీ ప్రారంభం కాలేదు. రేషన్‌డీలర్లను అడిగితే హమాలీలు ధర్నా చేస్తున్నారని అందుకే ఇంకా రేషన్‌స్టాక్ రాలేదని సమాధానం ఇస్తున్నారు. కావున అధికారులు చొరవ తీసుకుని రేషన్ అందేలా చూడాలి.

\- దేవోల్ల సురేష్, తిరుపెల్లి, లబ్ధిదారుడు

ఘనంగా ముత్యాలమ్మ వార్షికోత్సవాలు



అమ్మవారి పల్లకీ మోస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెండ్‌పెల్లి గ్రామంలో సోమవారం ముత్యాలమ్మ 4వ వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే రామారావు పటేల్ పాల్గొన్నారు. ప్రజలు సుఖశాంతులతో, పాడిపంటలతో, అమ్మవారి ఆశీస్సులతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ ప్రాథమిక పాఠశాలలో గ్రామాభివృద్ధి కమిటీ, ఉపాధ్యాయుల విన్నపం మేరకు ప్రహరీగోడ, అదనపు గదులు, కల్చరల్ స్టేజ్, పలు సంక్షేమ కార్యక్రమాలు దశల వారీగా మంజూరు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, బీజేపీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కోసం భూమిపూజ



మల్లాపూర్‌లో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కోసం భూమిపూజ

లక్ష్మణచాంద, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లాపూర్ గ్రామంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కోసం సోమవారం భూమిపూజ చేశారు. స్థానిక శివాలయం సమీపంలో అత్యంత భారీ ఎత్తు విగ్రహాన్ని నిర్మించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్‌లు అడిచెర్ల రవి కుమార్, కేశం శ్రీనివాస్, ద్యావతి పోశెట్టి, నాయకులు దేవర్ల భీమేశ్వర్, గ్రామ వీడీసీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

శబరిమల బయలుదేరిన అయ్యప్ప స్వాములు



మూర్తి గురుస్వామితో అయ్యప్ప స్వాములు

నిర్మల్ రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని హరిహర క్షేత్రం అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ పూజారి సదాశివ గురుస్వామి, మూర్తి గురుస్వామిచే ఇరుముడి కట్టించుకుని తన్మయత్వంతో శరణుఘోష చెప్పుకుంటూ శబరిమలకు బయలుదేరుతున్నట్లు గురుస్వామి పాకాల రామచంద్ర తెలిపారు. ఈ యాత్రలో శ్రీనివాస్, రమేష్, రాజన్న, అలకు రవి, దేవదాస్, అర్జున్, గంగాధర్, వెంకట్ రెడ్డి, సుమన్, అశోక్, తదితర స్వాములు వెళ్తున్నట్లు తెలిపారు.



ప్రజల నుండి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. రైతు రుణమాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, రెండు పడక గదుల ఇళ్ల వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల వారీగా ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించినప్పుడు వాటికి సంబంధించిన వివరాలను క్లుప్తంగా రిమార్కుల విభాగంలో పొందుపరచాలని ఆదేశించారు. దరఖాస్తుదారులకు పరిష్కారానికి సంబంధించిన వివరాలను అందజేయాలన్నారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ... ఇప్పటి వరకు జిల్లాలో 91.62 శాతం ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. మిగిలిన సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మండల స్థాయి అధికారులు ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. కేజీబీవీలను సంబంధిత అధికారులంతా ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ నివేదికలను అందజేయాలన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి అల్లోల

సారంగాపూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలోని కిన్వట్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే జాదవ్ ప్రదీప్ నాయక్ ఇటీవలే అకాల మరణం చెందడంతో బాధిత కుటుంబాన్ని సోమవారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అజ్మీరారేఖ శ్యాంనాయక్, రాథోడ్ బాపురావు, డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డిలు పరామర్శించారు.

నిర్మల్ చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేస్తాం

- ధూం ధాంగా సాగిన నిర్మల్ ఉత్సవాలు
- పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- మంత్రికి స్వాగతం పలికిన కలెక్టర్ అభిలాష అభినవ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

నిర్మల్ అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ ఉత్సవాల 2వ రోజు సోమవారం సాయంత్రం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి సీతక్కకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పూల మొక్కతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను కలెక్టర్, ఇతర అధికారులతో కలిసి మంత్రి సందర్శించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన గావించి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ... నిర్మల్ చరిత్రపై పరిశోధనలు జరిపి భవిష్యత్ తరాలకు తెలియజేసేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా, శిశు, సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. వినూత్నంగా జిల్లాలో నిర్మల్ ఉత్సవాల పేరిట ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్‌ను మంత్రి అభినందించారు. నిర్మల్ జిల్లా సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి తెలియజెప్పేందుకు ఇటువంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవడం గొప్ప విషయమని తెలిపారు. నిర్మల్ పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. ప్రభుత్వ, ప్రైవేట్, మహిళా స్వయం సంఘాలచే ఏర్పాటు చేసిన స్టాళ్లు గొప్పగా ఉన్నాయని అభినందించారు. ఖానాపూర్ శాసన సభ్యులు మాట్లాడుతూ... నిర్మల్‌కు ఘనమైన చరిత్ర ఉందని, బయట ప్రపంచానికి తెలిపేలా ఇలాంటి ఉత్సవాలు నిర్వహించుకోవడం గొప్ప విషయమని అన్నారు. ఉత్సవాలను విజయవంతం చేసిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు, ప్రజలందరికీ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ... జిల్లా చరిత్రను ప్రపంచానికి తెలియజేయాలన్న ఉద్దేశంతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులను జిల్లా కలెక్టర్ శాలువాతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. జిల్లా అధికారులతో మంత్రి గ్రూప్ ఫోటో దిగారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్‌లు, ఎస్పీ జానకి షర్మిల, అదనపు ఎస్పీలు అవినాష్, రాజేష్ మీనా, ఉపేందర్ రెడ్డి, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శన

ప్రజలు నిర్భయంగా పోలీసుసేవలను వినియోగించుకోవాలి

ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్ రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఎస్పీ జానకీ షర్మిల మాట్లాడుతూ.. జిల్లా ప్రజలు నిర్భయంగా, ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసుసేవలను వినియోగించుకోవాలని తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని వారి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత పోలీసుస్టేషన్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నామని తెలిపారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకీషర్మిల

ధర్మారం, వడ్యాల్ గ్రామాల్లో

పీఏసీఎస్‌లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఏలేటికి వినతి

లక్ష్మణచాంద, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడ్యాల్, ధర్మారం గ్రామాల్లో పీఏసీఎస్‌లను ఏర్పాటు చేయాలని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డికి సోమవారం వినతి పత్రం సమర్పించారు. ధర్మారంలో పీఏసీఎస్ కేంద్రానికి అవసరమైన భవనం, గోదాములు ఉన్నాయని, వడ్యాల్‌లో అందుకు అవసరమైన భూమిని కొనుగోలు చేశామని కావునా ఈ రెండు గ్రామాలకు పీఏసీఎస్ కేంద్రాలను మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎర్ర ముత్యం రెడ్డి, అడ్వాల రమేష్, ఓస రాజు, తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ఎమ్మెల్యే ఏలేటికి గంజాల్ టోల్‌ప్లాజా కార్మికుల వినతి

సోన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : గత 15 సంవత్సరాల నుంచి 75 మంది కార్మికులు గంజాల్ టోల్‌ప్లాజాలో జీవనభృతి కొరకు పనిచేస్తున్నారని, వారిని నూతనంగా రాబోతున్న కంపెనీ వారు కొంత మంది కార్మికులను తొలగిస్తున్నామని తెలియజేశారు. ఈ మేరకు కార్మికులు నిర్మల్ శాసన సభ్యులు మహేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ప్రతి ఒక్క కార్మికుడిని కొనసాగించాలని మేనేజర్‌కు తెలియజేశారు. దీంతో మేనేజర్ అందరినీ కంటిన్యూ చేస్తామని తెలియజేశారు. కార్మికులందరూ ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలియజేశారు.

రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నిర్మల్ రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బుధవార్‌పేట్ శివకోటి ఆలయం ముందు రోడ్డు నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి బీజేఎల్పీ నాయకులు ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, ఎం. రాజు, అరవింద్, జగదం యశోద, ఉమా, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఆత్మహత్యను ఆపిన పోలీసులు



ఆత్మహత్య యత్నం చేస్తున్న వ్యక్తిని కాపాడుతున్న పోలీసుసిబ్బంది

పెంబి / (ఖానాపూర్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ మండలంలోని ఎల్లాపూర్ గ్రామానికి చెందిన బక్కన్న కుటుంబ సమస్యలతో బాధపడుతూ ఆదివారం రాత్రి ఆత్మహత్య ప్రయత్నానికి పాల్పడడంతో కుటుంబ సభ్యులు 100కు డయల్ చేయడంతో వెంటనే ఖానాపూర్ బ్లూ కోర్ట్ పోలీసు సిబ్బంది సుధీర్‌కుమార్, బి. సంతోష్ నాయక్‌లు కలిసి ఎల్లాపూర్ గ్రామానికి వెళ్లి బక్కన్న కుటుంబ సభ్యులతో విచారించడంతో ఆ వ్యక్తి కుటుంబ సమస్యలతో బాధపడుతూ ఇంట్లో గొడవ పడి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తాను చనిపోతున్నానని తెలియజేయడంతో వెంటనే పోలీస్ సిబ్బంది అతని ఫోన్ లొకేషన్ ద్వారా అతను ఖానాపూర్ నుంచి దాదాపు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెంబి మండలంలోని యాపల్‌గూడ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో చూపించగా అక్కడే సమీపంలో ఉన్న పెంబి పోలీస్ స్టేషన్ బ్లూ కోర్ట్ సిబ్బంది అయిన రాజు, హోంగార్డు జి. రమేష్ పోలీస్ సిబ్బందితో కలిసి సంయుక్తంగా అతని సెల్ ఫోన్ లొకేషన్ ఆధారంగా దాదాపు 3 గంటల పాటు శ్రమించి వెతికి చివరకు రాత్రి 11:30 నిమిషాలకు బక్కన్న కనిపించగా వెంటనే అతనిని అదుపులోకి తీసుకొని ఆత్మహత్య ప్రయత్నం ఆపి, అతనికి ధైర్య చెప్పి, ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి అతన్ని అతని కుటుంబానికి అప్పగించారు. అతని కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చి బక్కన్నను అతని కుటుంబానికి అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ డా. జి. జానకిషర్మిల ఐపీఎస్ ఖానాపూర్ పెంబి పోలీస్ సిబ్బందిని ప్రశంసించారు.

ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఒకరి మృతి

సోన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాక్‌పట్ల గ్రామానికి చెందిన మహమ్మద్ ఖాసిం(52) అనే వ్యక్తి రోడ్డుపై నడుచుకుంటూ రోడ్డు క్రాస్ చేస్తుండగా, మాధాపూర్ పెట్రోల్ బంక్ వైపు వెళ్తున్న ట్రాక్టర్ మహమ్మద్ ఖాసింను ఢీకొట్టింది. మహమ్మద్ ఖాసింకు ఛాతి, తలకు గాయాలయ్యాయి. కాగా వెంటనే అతడిని నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి డాక్టర్లు పరీక్షించి చనిపోయినట్లు నిర్ధారించారు. మృతుడి అన్న గోరేమియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోన్ ఎస్సై కే. గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాకింగ్ చేస్తున్న

వారిపైకి దూసుకెళ్లిన కారు

నర్సాపూర్ (జి), జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన ఉజిగిరి గణపతి, ఆవుల్దాపూర్ గంగారెడ్డి ప్రతిరోజు లాగే సోమవారం కూడా ఉదయం నడకకు వెళ్లారు. నర్సాపూర్(జి) బస్టాండ్ నుంచి నసీరాబాద్ వైపు ఎన్‌హెచ్ 61 మీదుగా నడుచుకుంటూ వెళ్తుండగా మార్గంలో పోలీసుస్టేషన్ దగ్గర భైంసా వైపు నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో గణపతి ఎడమ కాలు విరిగింది. చేతులకు, తలకు రక్తపు గాయాలయ్యాయి. అలాగే గంగారెడ్డి చేతులకు రక్తపు గాయాలయ్యాయి. మెట్‌పల్లి మండలానికి చెందిన అబ్దుల్ రహమాన్ కారుగా గుర్తించారు. గణపతి తమ్ముడు సాయన్న నర్సాపూర్ (జి) పోలీసుస్టేషన్‌లో దరఖాస్తు ఇవ్వగా ఎస్సై పి. సాయికుమార్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.